అక్కరకురాని పీఏసీఎస్

- రైతులకు ఉపయోగపడని పూసపాటిరేగ పీఏసీఎస్
- ఏడాది కాలంగా అన్నదాతకు అందని రుణాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతాంగం

పూసపాటిరేగ: రైతును ఆర్థికంగా ఆదుకోవాలనే లక్ష్యంతో ఏర్పడిన పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం)లు పనికిరాకుండా పోతున్నాయి. గతేడాది కాలంగా అన్నదాతకు ఇవ్వాల్సిన రుణాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇంతవరకు ఏ ఒక్క రైతుకూ ఇప్పటివరకు పంట రుణం అందించిన దాఖలాలు లేవు. ముఖ్యంగా పూసపాటిరేగ పీఏసీఎస్ పరిధిలో 800 మంది రైతులు రుణ అర్హత పొంది ఉన్నారు. అనధికారికంగా మరో 5 వేల మంది రైతులు పీఏసీఎస్ పరిధిలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా పీఏసీఎస్‌లలో పాలకవర్గం ఏర్పాటు చేసి, రైతులకు సేవలందిస్తున్నా పూర్తిస్థాయిలో లేవన్న విమర్శలు ఉన్నాయి. కనీసం రైతులకు అందివ్వాల్సిన యూరియా కూడా పీఏసీఎస్ వద్ద కానరాని పరిస్థితి. ఈ నేపథ్యంలో పూసపాటిరేగ పీఏసీఎస్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు కూడా మొక్కుబడిగా ఉదయం విధులకు హాజరై, సాయంత్రం వెళ్లిపోతున్నారు.


పూసపాటిరేగ పీఏసీఎస్ కార్యాలయం

గతంలో గొప్పగా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పీఏసీఎస్‌ల పనితీరు గొప్పగా ఉండేది. రైతులను అన్నివిధాలా ఆదుకుని వారి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగింది. విత్తనాల దగ్గర నుంచి పంటల విక్రయం వరకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చింది. బ్యాంకర్లకు ప్రభుత్వమే హామీ ఉండి రైతులకు పంటరుణం అందించే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో అటువంటి పరిస్థితి లేదు. కనీసం రైతులకు అవసరమైన యూరియా కూడా అందించలేని దుస్థితిలో చంద్రబాబు సర్కారు ఉందంటే అన్నదాతను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందనడానికి ఇదే నిదర్శనం. ఇప్పటికైనా రైతులను ఆదుకునేందుకు చొరవ చూపాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఉద్యోగుల నిర్లక్ష్యం..

పూసపాటిరేగ పీఏసీఎస్ ద్వారా రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగడం లేదు. ముఖ్యంగా ఇక్కడి ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో రుణాలు రావడం లేదు. కనీసం ఎరువుల కోసం ప్రతిపాదనలు పెట్టడం లేదు. ఏడాది కాలంగా ఏ ఒక్క రైతుకు రుణం అందలేదు.

–టి.సీతారాం, సర్పంచ్, పూసపాటిరేగ

పంట రుణం ఇవ్వలేదు..

పంట రుణాలు మంజూరు కాలేదు. రైతుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా కూడా సేవలు అంతంతమాత్రమే. కంప్యూటరీకరణ పూర్తయిన తర్వాత రుణాలు మంజూరు చేస్తామంటున్నారు. అయినా ఇవ్వడం లేదు.

–కె.రాము, రైతు, పూసపాటిరేగ

నిధులు మంజూరు కాలేదు..

ప్రభుత్వం నుంచి పంట రుణాల మంజూరుకు కావాల్సిన నిధులు ఇంకా రాలేదు. ప్రతిపాదనలు చేశాం కానీ నిధులు మంజూరు కాలేదు. కొంత మంది రైతులకు మార్ట్‌గేజ్ రుణాలు ఇచ్చాం. నిధులు మంజూరైతే పంటరుణాలు కూడా అందిస్తాం.

–ఈశ్వరరావు, సీఈవో, పూసపాటిరేగ పీఏసీఎస్

క్లుప్తంగా

మానసాదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మానసాదేవి నాగశక్తి

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం పరిసరాల్లో గల మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు.

సోంపురం విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు సుపథ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వేపాడ, లక్కవరపుకోట మండల స్థాయి సుపథ పోటీలు లక్కవరపుకోటలో ఆదివారం నిర్వహించారు. శ్లోకపఠనం పోటీల్లో సోంపురం పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.బాలజీ, వి.సుధీర్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. అలాగే క్విజ్, పద్యపఠనం పోటీల్లో హెచ్. దిలీప్, హెచ్. దీక్షిత, ఈ. నందిని, హెచ్.వర్షిణి ప్రతిభ కనబరిచారు. దీంతో విద్యార్థులను హెచ్‌ఎం బీపీప రాజు, ఉపాధ్యాయులు వి.జగన్నాథం, బి.జ్యోతి, తదితరులు అభినందించారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: విజయనగరంలో జరుగుతున్న జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలలో పలు పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ఆర్. రామచంద్రపురం పాఠశాల చెందిన రోహిత్, మణికంఠలు రూపొందించిన ప్రాజెక్ట్ ఆకట్టుకోవడంతో జనవిజ్ఞాన వేదిక నాయకులతో పాటు పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తినాయుడు, ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించారు.

శ్రమదానంతో గండి పూడ్చివేత


గండిని పూడ్చుతున్న రైతులు

జామి: మండలంలోని వెన్నెలో సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందించే చెక్‌డ్యామ్ (చప్టా) శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి గండి పడింది. దీంతో సాగునీరు వృథాగా పోతోంది. దీంతో రైతులందరూ ముందుకు వచ్చి శ్రమదానంతో ఇసుక బస్తాలతో ఆదివారం గండిని పూడ్చారు. ఇందు కోసం రైతులు సుమారు 50 వేల రూపాయలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తాత్కాలికంగా పూడ్చిన గండి మళ్లీ కొట్టుకుపోయే ప్రమాదముందని.. అధికారులు, పాలకులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన గండిని పూడ్చాలని కోరుతున్నారు.

రెడ్‌క్రాస్‌లో అందుబాటులో బ్లడ్..

చీపురుపల్లి: జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్‌లో బ్లడ్ యూనిట్స్ అందుబాటులో ఉన్నాయని రెడ్‌క్రాస్ చీపురుపల్లి డివిజన్ కోఆర్డినేటర్ బీవీ గోవిందరాజులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం అవసరమైన వారికి డోనర్‌తో సంబంధం లేకుండా బ్లడ్ యూనిట్స్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అయితే క్రాస్ మ్యాచింగ్ పరీక్ష కోసం మాత్రమే రూ.800 చార్జీలు వసూలు చేస్తారని తెలిపారు. డోనర్ అవసరం లేకుండా తలసేమియా, సికిల్‌సెల్, ఎనీమియా, హెచ్‌ఐవీ, క్యాన్సర్ రోగులకు ఉచితంగా బ్లడ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 08922–272700 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఈపీఎఫ్ పింఛన్ రూ.9 వేలు చేయాలి


మాట్లాడుతున్న ఈపీఎఫ్ పింఛన్‌దారుల సంఘ నాయకులు

నెల్లిమర్ల: ఈపీఎఫ్ పింఛన్ రూ.9 వేలు చేయాలని ఈపీఎఫ్ పింఛన్‌దారుల సంఘం జిల్లా కార్యదర్శి ఓఎస్ఎన్ మూర్తి, కోశాధికారి అంబళ్ల గౌరినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక సంఘ భవనంలో ఆ సంఘ నాయకుడు మొయిద పాపారావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో వారు పాల్గొని, మాట్లాడారు. ఈపీఎఫ్‌పై డీఏలు వర్తింపజేయాలని, రైల్వే టికెట్లపై కూడా రాయితీ ఇవ్వాలన్నారు. మోదీ సర్కారు పింఛన్ నిధులను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ వ్యక్తుల లాభాల కోసం వినియోగిస్తోందని ఆరోపించారు. ఈపీఎఫ్ నిధులు 2025 నాటికి రూ.9 లక్షల కోట్లు కేంద్ర సంస్థల వద్ద ఉన్నాయని దీనిపై రూ.60 వేల కోట్లు వడ్డీ వస్తోందన్నారు. ఈ వడ్డీ డబ్బులతోనైనా ఒక్కొక్క రిటైర్డు కార్మికుడికి రూ.10 వేల పింఛన్ ఇవ్వొచ్చన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కిల్లంపల్లి రామారావు, కాళ్ల అప్పలసూరి, నామాల తిరుపతిరావు, కంది శ్రీరాముడు, యడ్ల పైడినాయుడు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ మాధ్యమిక పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. హిందీ ప్రచారక్ కె. శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో హిందీ పండిట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అభినందనల వెల్లువ


కోలగట్ల శ్రావణిని అభినందిస్తున్న క్రీడాకారులు

విజయనగరం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయనగరం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఆమెకు పార్టీ శ్రేణులు సహా ఇతరుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్, క్రీడాకారులు నగరంలోని మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి నివాసానికి ఆదివారం వెళ్లి, ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం పెట్టుకున్న పార్టీ అధిష్టానం మేర నడుచుకుని, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కాళ్ల సూరిబాబు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు..
జనం అవస్థలు


గొర్లిపేట రోడ్డు గుంతల్లో నిల్వ ఉన్న వర్షపునీరు

నెల్లిమర్ల–రణస్థలం ప్రధాన రహదారి సహా పలు గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుకో గుంత..గజానికో గొయ్యి మాదిరి ఉన్నాయి. దీంతో అటువైపుగా వెళ్లే వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లు మీదుగా వెళ్తుంటే ఒళ్లు హూనమైపోతోందని వాపోతున్నారు. తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండగ నాటికి రోడ్లు వేసి చూపిస్తామని ప్రగల్భాలు పలికారని, ఎక్కడ రోడ్లు వేశారని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తున్నారు. కొత్త రోడ్లు వేయకపోయినా ఫర్వాలేదు.. ఉన్న రోడ్లు అయినా బాగు చేయాలని కోరుతున్నారు.


ధ్వంసమైన దేవునినెలివాడ రోడ్డు

–నెల్లిమర్ల రూరల్

ఘనంగా హిందీ దివస్


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది

విజయనగరం: మండలంలోని జొన్నవలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు టి.విజయలక్ష్మి హిందీ భాష గొప్పతనం, ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 50 మంది విద్యార్థులు 9 అంశాల్లో ఇచ్చిన కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.

ఆర్థికసాయం అందజేత


సర్పంచ్ చేతులమీదుగా ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేటకు చెందిన సాధనాల లక్ష్మణరావు అనే రోగికి దాతలు ఆర్థికసాయం చేశారు. ఆరు నెలలుగా ఆయన బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ మంచానపడ్డాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉండగా ఆయనది నిరుపేద కుటుంబం కావడంతో సాయం చేసేందుకు దాతలు ముందుకువచ్చారు. ఇదే గ్రామ ఉపసర్పంచ్ వాకాడ నారాయణమ్మ భర్త వాకాడ శ్రీనివాసరావుతో పాటు ఆయన దాతల వద్ద నుంచి సేకరించిన రూ.26 వేల నగదు, బియ్యం బస్తాను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైల ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బద్దుకొండ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విరామకాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ మహేష్

డెంకాడ: విద్యార్థులకు దొరికే విరామకాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సెలవు రోజుల్లో పుస్తక పఠనం వైపు ఆసక్తి కనబరచాలని లైబ్రేరియన్ వై.మహేష్ కోరారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదివితే అపారమైన విజ్ఞానం కలుగుతుందని, ఎంతోమంది నిరుద్యోగులు గ్రంథాలయాల్లో చదువుకుని ఉద్యోగాలు సాధించారని, మరెంతోమంది విజ్ఞానవంతులయ్యారన్నారు. ఇంట్లో స్మార్ట్‌ఫోన్లతో సమయం వృథా చేయకుండా గ్రంథాలయాలకు వచ్చి, జ్ఞానం సంపాదించుకోవాలన్నారు.

మొరాయించిన బస్సు


సిటీబస్సును తోస్తున్న ప్రయాణికులు

వేపాడ: కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు తిప్పుతుండడంతో ఎప్పుడు ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంటోంది. వేపాడ మండల కేంద్రానికి మద్దిలపాలెం, గాజువాక డిపోలకు చెందిన రెండు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఆదివారం ఉదయం ఐదు గంటలకు విశాఖ ఆర్టీసీకి కాంప్లెక్స్ బయలుదేరిన బస్సు కొద్ది నిమిషాల్లోనే మొరాయించింది. దీంతో ప్రయాణికులు బస్సును తోయగా.. సెల్ఫ్ అవ్వడం .. ఆగిపోవడం జరిగింది. సుమారు గంట కాలం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఆర్టీసీ అధికారులు కండీషన్ ఉన్న బస్సులను తిప్పాలని పలువురు కోరుతున్నారు.

గురజాడ జయంతిని రాష్ట్ర పండగగా గుర్తించాలి


ఎమ్మెల్యేలకు అందించేందుకు సిద్ధం చేసిన వినతిపత్రాలు చూపిస్తున్న జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు బాబ్జీ, ప్రజాసంఘాల నేతలు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వేంకట అప్పారావు జయంతిని రాష్ట్ర పండగగా గుర్తించి, నిర్వహించాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. స్థానిక గురజాడ స్వగృహంలో జిల్లా పౌరవేదిక ఆధ్వర్యంలో ప్రజాసంఘాల సమావేశం ఆదివారం జరిగింది. ప్రభుత్వం జీవో నంబరు 689 ప్రకారం 22 మంది ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర పండగల్లా చేస్తామని ప్రకటించిందని, ఆ 22 మంది ప్రముఖుల్లో గురజాడ పేరు లేకపోవడం బాధాకరమన్నారు. సెప్టెంబరు 18వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనైనా ఈ అంశాన్ని జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రి శ్రీనివాస్ కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఇదే విషయమై జిల్లా పౌరవేదిక తరఫున సోమ, మంగళవారాల్లో ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు అందిస్తామన్నారు. అలాగే గురజాడ గృహ ఆధునీకరణ, గురజాడ సాహిత్యం డిజిటలైజేషన్ వంటి అంశాలపై త్వరలో గురజాడ విగ్రహం వద్ద నిరసన చేపడతామన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల నేతలు రొంగలి పోతన్న, వైద్యుడు ఎం.వెంకటేశ్వరరావు, విద్యావేత్త గుల్లిపల్లి జయపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పశువుల పండుగ


వేపాడ: దబ్బిరాజుపేటలో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గంట్యాడ: మండలంలోని బుడతానపల్లిలో పశువుల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేపచెట్టుకు (అమ్మవారు) ప్రత్యేక పూజలు చేసి వేపాకులు, పసుపు కలిపిన నీటిని పశువుల మీద చల్లారు. కార్యక్రమంలో సర్పంచ్ అలమండ వాణి, ఎంపీటీసీ సభ్యురాలు వర్రి అర్జునమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా..

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో పశువులమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, రాయుడుపేట, గుడివాడ, బొద్దాం, తదితర గ్రామాల్లో పశువుల పండుగ సందర్భంగా అమ్మవారిని ఊరేగించారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ పూర్తయిన పశువుల పండుగ చేపడతామని ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు.

ఐకమత్యంతో ముందుకెళ్దాం..

- ఇనాం భూముల రైతులు

చీపురుపల్లి: ఎన్నో దశాబ్దాలుగా ఇనాం సమస్యతో అవస్థలు పడుతున్నాం.. ఇప్పటికైనా ఇనాం రైతులంతా పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి సమస్యను పరిష్కరించుకుందామని తీర్మానించుకున్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ జి. అగ్రహారానికి చెందిన ఇనాం రైతులు ఆదివారం స్థానిక సచివాలయ ఆవరణలో సమావేశమయ్యారు. జి.అగ్రహారం పరిధిలో ఎన్నో వందల సంవత్సరాల కిందట నుంచి 1190 ఎకరాలు ఇనాం భూములున్నాయని తెలిపారు. ఆ భూములను అగ్రహారంనకు చెందిన రైతులే సాగు చేసుకుంటున్నప్పటికీ, వాటిపై ఎటువంటి హక్కులు లేకపోవడం బాధాకరమన్నారు. కనీసం వన్‌బీ కూడా రైతుల పేరిట రాకపోవడంతో అన్నదాత సుఖీభవ వంటి పథకాలు వర్తించడం లేదని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో ఇనాం అని ఉన్నప్పటికీ.. ఆ భూములకు ఇనాం వారసులెవ్వరూ లేరని, ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమకే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇనాం భూముల సమస్యను రెవెన్యూ అధికారులు దృష్టికి సమష్టిగా తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.